# వయోధర్మం

ఎయిర్‌పోర్ట్‌కెళ్లిన రామనాథం విమానం రావడానికి ఇంకా గంట ఆలస్యముందని తెలిసి కాఫీ తాగడానికి బయల్దేరాడు. క్షణం ఆశ్చర్యపోయాడు. తన క్లాస్‌మేట్ సుందరి అక్కడే కాఫీ తాగుతూ కనిపించింది.

"హలో" అంటూ సుందరి రామనాధాన్ని గుర్తించి పలుకరించింది. ఎప్పటి క్లాస్‌మేట్? బిఏ చదివే రోజుల్లో...ఎన్నేళ్ళయిందో చూసి.

"ఇక్కడేనా?" అంది రామనాధాన్ని పరిశీలనగా చూస్తూ.

పెద్ద మార్పులేదు. అలాగే వున్నాడనిపించింది. జుట్టుకి రంగేసుకోలేదు. వేసుకుని వుంటే అప్పటి రామనాథంలాగే వుండేవాడు పూర్తిగా. అదే నవ్వు, అదే మాట. సుందరికి ఒక్కసారి అనిపించింది-ఈ రామనాథం అదృష్టవంతుడు. హాయిగా భార్యా పిల్లలు, సంసారం. రిటైరయితేనేం, కొడుకు అమెరికా నుంచి వస్తున్నాడేమో, అందుకే ఒక్కడొచ్చి వుంటాడు... ఇలా మనసులో అనుకుంటూ కాఫీ కప్పు పక్కన డస్ట్‌బిన్‌లో పడేసింది సుందరి.

"కాఫీ బాగుంది. మరో కప్పు తాగుదాం" అంటూ రెండు కప్పులు తెచ్చాడు రామనాథం. సుందరిలో ఎంత మార్పొచ్చింది. చదువుకునే రోజుల్లో చాలా అందగత్తె కింద లెక్క. తండ్రి చాలా డబున్న లాయర్ కావడంతో కాలేజికి కారులో వచ్చేది. ఆ రోజుల్లో అది చాలా గొప్ప. ప్రేమలేఖలు రాయడం, కారు కదిలేవరకూ నిలబడి చేయి ఊపడం లాంటివి ఆనాడు ఒకరిద్దరు చేసారని గుర్తు రామనాధానికి. అయితే బిఏ పూర్తి కాకుండానే బొంబాయిలో గొప్ప డాక్టర్‌తో పెళ్లయింది సుందరికి. ఏదయినా అదృష్టవంతురాలు. డాక్టర్ భర్త, కొడుకో, కూతురో డాక్టరు అయ్యుంటారు. భర్తని రిసీవ్ చేసుకుందుకు వచ్చి వుంటుంది. ఓ వారంరోజులు ఇక్కడ గడిపి వెళ్లిపోతుందేమో. రామనాథం కాఫీ కప్పు పక్కన పడేస్తూ సుందరివంక చూసాడు. మెడలో మెరుస్తున్న పగడాలు, ముఖాన సన్నని స్టిక్కరు బొట్టు, బాగా లావయింది. నవ్వుతుంటే బుగ్గలు డింపుల్స్ పడుతూ ముఖం అందంగా అలాగే వుంది.

ఎనౌన్స్‌మెంట్ చెవిన పడింది. రామనాథం, సుందరి అక్కడినుండి కదిలారు. స్నేహితుడి ఇంట్లో అడుగుపెట్టగానే హాయిగా ఊపిరి తీసుకున్నట్లనిపించింది విశ్వానికి. కానీ అటూ ఇటూ చూస్తున్న విశ్వానికి ఓ క్షణం బాధనిపించింది ఎందుకో.

నౌకరు కాఫీ తెచ్చి బల్లమీదుంచాడు. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకున్నారు స్నేహితులు. "ఏరీ కొడుకూ కోడలూ?" అన్నాడు విశ్వం. "వాడికి ట్రాన్స్ఫరయింది." "అయితే నువ్వు ఒక్కడివీ ఇక్కడెందుకు? నువ్వూ వెళ్లలేకపోయావా?" అన్నాడు విశ్వం. అంత పెద్ద ఇల్లు బోసిగా అనిపించింది.

రామనాథం భార్యపోయి పదిహేనేళ్ళయింది. ఒక్క కొడుక్కి పెళ్లి చేసాడు రామనాథం. ఏడాదిక్రితం వరకూ ఉద్యోగం గొడవ సరిపోయింది. ఇప్పుడే వచ్చింది వంటరితనం.

"ఈ వంటరితనమేమిటి నీకు? హాయిగా పెళ్లి చేసుకో" అన్నాడు విశ్వం.

"పెళ్ళా?" "అవును. నీకు అరవై ఒక్క సంవత్సరం." రామనాథం ఫక్కున నవ్వాడు. "అందుకే నాకు పెళ్లేమిటి?" "ఇప్పుడే నీకు అవసరం. ఓ తోడు వుండాలి కదా. అయినా నీ కొడుక్కి బుద్ధిలేదా? నువ్వు రానంటే బలవంతంగా లాక్కుపోవాలి. అంతేగానీ ఒక్కడివీ ఇలా వంటవాడి చేత వండించుకుని తినడం ఛీ...బాగాలేదు" విశ్వం రామనాథం వంక చూసాడు.

"నేనేదో తప్పుగా అంటున్నాననుకోకు. ఒక్కసారి అక్కడికిరా. పెళ్లికి వయసుకి ఏమీ సంబంధం లేదు. ఇప్పుడు పెళ్లంటే శారీరకావసరం కాదురా స్నేహం, తోడు ఒకరికొకరు అంతే. ఇంతవరకూ ఈ మాట నీకు ఎవరూ చెప్పలేదా?"

విశ్వం గట్టిగా అంటుంటే కొత్త మాటలు, వినకూడని మాటలు వింటున్నట్లు అనిపించింది రామనాథానికి. అయినా అరవై ఏళ్ళు దాటాక పెళ్ళేమిటి? ఎవరు చేసుకునేందుకు ఇష్టపడి వస్తారు? ఛీ... ఈ ఆలోచనే తప్పు" రామనాథం మళ్ళీ గలగలా నవ్వాడు.

"నీకు ఇంకో ఇరవై ఏళ్ళు బతుకుతావనుకో ఆరోగ్యంగా. అన్ని ఏళ్ళు వంటరిగా ఉండాల్సిందేనా? ఈ ట్రిప్పులో నేను నిన్ను ఇలా ఉండనీయను. భర్త పోయిన ఆడవాళ్ళే మళ్ళీ పెళ్లి చేసుకుందుకు ఇష్టపడుతుంటే నీకేమిటి?"

విశ్వం ఆ రోజంతా ఇదే విషయం రకరకాలుగా మార్చి మార్చి, అమెరికాలో వారితో పోల్చి పోల్చి చెప్పి ఊదరగొట్టేసాడు రామనాథాన్ని.

తెల్లారింది.

విశ్వం చుట్టాలింటికి వెళతానన్నాడు. రామనాథం తీసుకెళ్లాలి. " ఒరేయ్ నీకు సుందరి గుర్తుందా?" అన్నాడు విశ్వం కళ్ళజోడు తీసి పెట్టుకుంటూ.

"సుందరి...అదేమిటి నిన్ననే చూసా" అన్నాడు రామనాధం.

"అది మా అత్తకూతురే. మన క్లాస్‌మేట్."

"భర్త, పిల్లలు బాగున్నారా? నిన్న ఎయిర్‌పోర్ట్‌లో కలిసింది." రామనాధం అంటుంటే విశ్వం ఏదో ఆలోచిస్తున్నాడు. "భర్తేమిటి? నీకు తెలియదా? పెళ్లయిన కొద్దినెలలకే యాక్సిడెంట్‌లో మరణించాడు."

"అయ్యో!" రామనాధం మనసు చాలా బాధపడింది.

"నువ్వంత బాధపడాల్సిందేమీలేదు. పదేళ్ళ నాడు అంటే సుందరికి ఏభై దగ్గర పడుతుంటే అమెరికాలో నా కొలీగ్‌ను పెళ్లి చేసుకుంది. హాయిగా వుంది. తమ్ముడి కూతురు పెళ్లికొచ్చింది."

రామనాధం చెవులని నమ్మలేకపోయాడు.

సుందరి భర్త పోయాడు. సరే మళ్ళీ పెళ్లి అదీ ఏభై సంవత్సరాల వయసులో. కాంపానియన్‌షిప్ అట. రామనాధం కళ్ళముందు సుందరి రూపం కదులుతోంది. అవును. కంపానియన్‌షిప్. అవసరమే.

రామనాధం మనసు రకరకాలాగా అడవిలో తిరుగుతున్నట్లుగా చిక్కిరిబిక్కిరిగా వుంది. సుందరి మళ్లీ పెళ్లి చేసుకుంది.

తనెందుకు చేసుకోకూడదు?

"ఒరేయ్ విశ్వం! నిజంగా నేను చేసుకుంటానంటే నాకు పెళ్లి చేయగలవా?" అన్నాడు రామనాధం పొద్దునే స్నేహితుడితో కలసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ.

"ఆ... అయితే ఒకటే కండిషన్. నీ భార్య జానకిమీద చేసినట్లు పెత్తనం చేయడం, ఆ చాదస్తం అన్నీ మానేయాలి. జస్ట్ ఫ్రెండ్స్."

కాలింగ్‌బెల్ మోగింది. సంభాషణ ఆగిపోయింది. విశ్వం వారంరోజులు ఏదో కాన్ఫరెన్స్ కోసం వచ్చి హడావుడిగా గడిపి వెళ్లిపోయాడు. కానీ విశ్వం నాటిన ఆలోచన రామనాధం మనసులో పెరుగుతూనే వుంది. ఒకరిద్దరు ముఖ్య స్నేహితులతో అన్నాడు.

"ఆ.. అనవసరం. ఆ వచ్చేది పరమ గయ్యాళిగంప అనుకో. నీ ఆస్తి అంతా తనకే రాయాలని నిన్ను ఏడిపించిందనుకో. ఇలాటివే మరెన్నో. ఆ విషయం మరచిపో" అన్నాడు భయపెడుతూ ముఖ్య స్నేహితుడు శ్రీ రాము రామనాధంతో ఖచ్చితంగా.

"అలాగేం కాకపోవచ్చు కూడా" అన్నాడు రామనాధం. ఈ ఆలోచనకి మరో కారణం ఒంటరితనం.

ఆ రాత్రి శ్రీరాము విజయవాడ వెళ్లాడు. రామనాథం కొడుకు కోడలు భోజనం చేస్తున్నారు. శ్రీరాముని బాబాయిగారూ అని పిలుస్తుంది రామనాథం కోడలు. "బాబాయిగారూ...భోజనం చేయండి. మా మామగారు బాగున్నారా?" అంది మంచినీళ్ళందిస్తూ.

శ్రీరాము ఫక్కున నవ్వాడు. "నవ్వుతారేమిటి?" అన్నాడు రామనాథం కొడుకు.

"ఏద్వలేక" శ్రీరాము గొంతు తగ్గించి "మీ నాన్న మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడట" అన్నాడు.

కొడుకు ముఖం వెలవెలపోయింది. కోడలు లోపల పనిలో వుంది.

"ఛీ...ఏమిటిదీ?" అన్నాడు నెమ్మదిగా.

"అందుకే వచ్చాను నీతో చెప్పాలని. పైగా ఇంట్లో భాగం కూడా రాస్తాడుట. ఒంటరితనం భరించలేకుండా వున్నాడు" అన్నాడు శ్రీరాము కళ్లజోడులోంచి రామనాథం కొడుకు ముఖం గమనిస్తూ. తెల్లారాక శ్రీరాము వెళ్లిపోయాడు.

"విన్నావాసరూ! నాన్నగారు మన గోపికి వొడుగు చేయాలను కుంటున్నారట. ఇప్పుడు మంచి ముహూర్తాలు వున్నాయని కబురుపెట్టారు" అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

ట్రాన్స్‌ఫర్ చేసుకోడం విషయం తరువాత చూడవచ్చు. ముందు సెలవు పెట్టుకుని ఏదో వంకతో వెళ్లి నాన్న దగ్గరుండాలి. లేకపోతే ఎంత ప్రమాదం! నాన్నగారు పెళ్లి చేసుకోడం- ఎందుకూ అంటే, ఒంటరితనం. రామనాథం కొడుకు రాఘవ తనలో తనే నవ్వుకున్నాడు.

"ఒక్క మాట వినండి. పిల్లాడికి వొడుగు చేద్దాం. మామగారు చెప్పినట్లు నేనూ, వాడూ, మామగారూ ఈ చిన్ని హాయిగా వుంటామక్కడ. పాపం మామగారికి ఎవరూ ఇంట్లో లేక తోచదు మరి. పెద్దవారు, ఒక్కర్నీ అలా వుండమంటే మా మావయ్య ఇలాగే భార్య పోయాక ఒంటరిగా వుండలేక పెళ్లి చేసుకున్నాడు. అదో పరమరాక్షసి" అంది సరోజ.

అప్పుడర్థమయింది నాకు. శ్రీరాము చెప్పిన మాటలు తనతో ఎంత రహస్యంగా చెప్పాడో సరోజతో కూడా అంత రహస్యంగా చెప్పాడని. వయోధర్మమేదో చెప్పాడు. తప్పేముంది?

రెండురోజులయ్యేసరికి రామనాథం ఇల్లు కళకళలాడింది. కొడుకు, కోడలూ, మనమలతో. ఫోన్ మోగుతోంది. రామనాథం తీసాడు. అమెరికానుంచి విశ్వం.

"అదే మాట్రిమోనియల్ కాలమ్‌లో చూడు తప్పులేదు. నువ్వుకూడా వెయ్యొచ్చు."

రామనాథం ఏమీ అనకుండా ఎదురుగావున్న కొడుకు కోడలూ వంక చూస్తూ "ఊ...ఊ..." అంటున్నాడు. చేతిలో ఫోను లాక్కున్నాడు. కొడుకు

"మాట్రిమోనియల్ కాలమ్‌లో ఏడో తేదీ హిందూ చూడు..."ఫోన్ కట్ అయింది. " ఏమిటి రాంగ్‌నెంబరా" అన్నాడు రామనాథం.

"తొందరగా కట్ అయిందిలెండి" అన్నాడు రాఘవ భార్య సరోజ వంక చూసి నవ్వి.

"షష్టి పూర్తి కథలు" - ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక జూన్ 2001